32 వార్డులుగా ఏదులాపురం మున్సిపాలిటీ!

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 10: నూతనంగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డులు ఏర్పాటు చేసే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందుకు అనుగుణంగానే ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర స్వరూపానికి తుది రూపు ఇచ్చే ప్రక్రియను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఖమ్మం రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం వార్డుల విభజన, గుర్తింపు ప్రక్రియ పారంభమైంది. ఇటీవల మున్సిపాలిటీలో విలీనమైన మొత్తం 12 గ్రామాల పంచాయతీల సెక్రటరీలు, పంచాయతీ సిబ్బంది, బీఎల్‌వోలు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. ప్రసుత గణంకాల ప్రకారం మున్సిపాలిటీలో సుమారు 44 వేల మంది ఓటర్లు ఉన్నారు. అయితే, ప్రతి వార్డుకు 1,300 – 1,400 వరకు ఓటర్లు ఉండే విధంగా వార్డుల విభజన ప్రకియను చేపట్టారు. అంటే రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో మొత్తం 32 వార్డులకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఒకటి రెండు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తిచేసి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నారు.

వార్డుల విభజన ప్రక్రియలో బీఎల్‌వోలు, మున్సిపాలిటీ సిబ్బంది

పర్యాటక కేంద్రంగా 'ఫారెస్ట్ పార్క్'

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

రఘునాథపాలెం, ఫిబ్రవరి 10 : ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను ఆకర్షనీయమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం పార్క్‌ను సందర్శించిన ఆయన వైరా ప్రధాన రహదారి నుంచి పార్క్ వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్ధ్ విక్రమ్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మెయిన్ రోడ్డు వద్ద వెలుగుమట్ల అర్బన్ పార్క్ గురించి తెలిసే విధంగా ఆర్చిని ఏర్పాటు చేయాలన్నారు. హైదరాబాద్‌లోని ప్రగతి రిసార్ట్‌ను ట్రెడిషనల్ ప్లాంట్స్‌తో ఆకర్షనీయంగా తయారుచేశారని, అదే రీతిలో వెలుగుమట్ల పార్క్‌ను రూపొందించాలని సూచించారు. బెస్ట్ వ్యూస్, సెల్ఫీ పాయింట్, సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేసిన సైకిల్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. దశల వారీగా పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, ఖమ్మం ఫారెస్ట్ రేంజ్ అధికారి జీ నాగేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఏఈ అనిత పాల్గొన్నారు.

ఫారెస్ట్ పార్క్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ప్రజా దరఖాస్తులకు సత్వర పరిష్కారం

అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం, ఫిబ్రవరి 10 : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని వివిధ వర్గాల ప్రజల నుంచి ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సమస్యలను ఎన్నిరోజుల్లో పరిష్కరిస్తారో లబ్ధిదారులకు అధికారులు క్షుణ్ణంగా తెలపాలన్నారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 10 : దివ్యాంగుల ఉపకరణాల నిమిత్తం ఎంపిక చేసేందుకు ఏర్పాటు చేయబోయే శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కే.రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి సంబంధించి ఎంపిక శిబిరం నగరంలోని రోటరీక్లబ్‌లో ఏర్పాటు జరిగింది. డీడబ్ల్యూవో ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి నియోజకవర్గంలోని 300మంది దివ్యాంగులు, వయోవృద్ధులు హాజరైనట్లు డీడబ్ల్యూవో తెలిపారు. అందులో భాగంగా ఏడీఐపీ పథకం కింద 139మంది అర్హులైన దివ్యాంగులు, రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం కింద 16మందిని సీనియర్ సిటీజన్లు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పరిశీలిస్తున్న రాంగోపాల్‌రెడ్డి

పెద్దాసుపత్రిలో టిఫా సేవలు పునరుద్ధరించాలి

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 10 : జిల్లా సార్వజనీన ఆసుపత్రిలోని మాతా, శిశు విభాగంలో మూలనపడిన టిఫా స్కానింగ్ సేవలను పునరుద్ధరించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా నాయకుడు ఎస్‌డీఎల్ విజయ్ దళపతి జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి సోమవారం ఐడీవోసీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కాలంగా రేడియాలజిస్ట్ పోస్టును భర్తీ చేయకుండా తాత్సారం చేస్తున్నారని తెలిపారు. దీంతో గ్రామీణ ప్రాంతాల దవాఖానకు వస్తున్న నిరుపేద గర్భిణులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ పెద్దాసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రాంబాబును పిలిచి వివరణ కోరారు. రేడియాలజిస్ట్ పోస్టుకు నోటిఫికేషన్ ఇచ్చామని త్వరలోనే సేవలను అందిస్తామని చెప్పారు.

అక్రమ హద్దురాళ్లను వెంటనే తొలగించాలి

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 10 : ఖమ్మం అర్బన్ మండలంలోని మల్లెమడుగు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 315, 317లో గ్రామ సమూహి భూమి 23 ఎకరాల 22 గుంటలకు సంబంధించి కొంతమంది అక్రమంగా హద్దురాళ్లు పాతినారని వెంటనే వాటిని తొలగించాలని ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండ్రోజుల్లో హద్దురాళ్లను తొలగించకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో గ్రామస్తులు సహకరించాలని పేర్కొన్నారు.

టెన్త్ ఇంటర్నల్ తనిఖీ షెడ్యూల్‌లో మార్పు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 10 : పదో తరగతి ఇంటర్నల్ మార్కుల తనిఖీ చేసే షెడ్యూల్‌లో స్వల్పమార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నెల 11వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పదో తరగతి ఇంటర్నల్ మార్కులు వెరిఫికేషన్ చేయాల్సి ఉండగా 11వ తేదీన ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఉండటంతో ఈ నెల 12వ తేదీ ప్రారంభంకానుంది. ఇందుకు సంబంధించి డీఈవో సోమశేఖరవర్మ, డీసీఈబీ సెక్రటరీ నారాయణ ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించారు. 57 బృందాలను నియమించగా ఒక్కో బృందంలో ఒక ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులు ఉన్నారు. వీరికి కనిష్టంగా మూడు పాఠశాలలను కేటాయించారు. జిల్లాలో అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలంలో 85కిపైగా పాఠశాలలు ఉండటంతో 7 బృందాలను కేటాయించగా సరిపోరని ఎంఈవో శైలజాలక్ష్మి డీఈఓకి విన్నవించడంతో 10 బృందాలు కేటాయించారు. ఒక్కో బృందానికి 7 నుంచి 8 పాఠశాలల్లో తనిఖీ చేయనున్నారు. సోమవారం పాత డీఈఓ కార్యాలయంలో అర్బన్ మండలానికి కేటాయించిన ప్రధానోపాధ్యాయుల బృందానికి ఎంఈవో పాఠశాలలను కేటాయించి, తనిఖీ సమయంలో తీసుకోవాల్సిన సూచనలు చేశారు.

హెచ్‌ఎంలకు సూచనలు చేస్తున్న అర్బన్ ఎంఈవో శైలజాలక్ష్మి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 10 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతోపాటు ఉపకార వేతనాలను తక్షణమే విడుదల చేయాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల బకాయిలను చెల్లించని కారణంగా విద్యార్థులతోపాటు కళాశాలల యాజమాన్యాలు సైతం తీవ్ర మనోవేదనకు గురవుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా ప్రజల చిరకాల కోరిక అయిన జనరల్ యూనివర్శిటీ స్థాపన కోసం మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మందా సురేష్, నాయకులు అజయ్, శ్యామల, కైఫ్, ఇందు, శ్రావణి, అనిత, నాగరాజు పాల్గొన్నారు.

జీకే, కరాటే పోటీల్లో టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 10: జీకే టాలెంట్ టెస్టు, స్పెల్‌బీ, కరాటే పోటీల్లో సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు తెలిపారు. 12వ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ 2025లో స్పేరింగ్ విభాగంలో ప్రథమ స్థానాన్ని జాన్‌వెస్లీ సాధించి గోల్డ్‌మెడల్, కరాటేలో ధరావత్ హర్షిత్ ప్రథమ సాధించి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. అదేవిధంగా జేకే టాలెంట్ టెస్టులో బొల్లోజు సాత్విక్ సాయిసంపత్ ప్రథమ, షేక్ వసీంఅక్రమ్ ద్వితీయ, చిన్నంశెట్టి లాస్యశ్రీ తృతీయ స్థానాలు సాధించి షీల్డ్, గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందుకున్నారు. స్పెల్‌బీలో కొడాలి సుస్మిత ప్రథమ, ముప్పాల కావ్య ద్వితీయ, కొట్టే మౌనిషా తృతీయ స్థానం సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ, స్కూల్ ఇన్‌చార్జి శంకర్, విద్యార్థులు అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

'శాతవాహన'కు ఇక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

సురక్షితమైన ప్రయాణం కోసం రైల్వే శాఖ చర్యలు: డీఆర్ఎం

మధిర, ఫిబ్రవరి 10: శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను అనుసంధానం చేయనున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ సోమవారం తెలిపారు. ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల ప్రవేశంతో ప్రయాణికులు సురక్షితమైన ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చునని అన్నారు. మధిర, ఖమ్మం, డోర్నకల్ మీదుగా సికింద్రాబాద్, విజయవాడ స్టేషన్ల మధ్య రాకపోకలు సాగించే ఈ శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికుల భద్రత, సౌకర్యం కోసం ఈ కీలక మార్పు చేసినట్లు చెప్పారు. శారు. విజయవాడ– సికింద్రాబాద్ స్టేషన్ల మధ్య రాకపోకలు సాగిస్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రస్తుతం ఉన్న ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో ఆధునిక ఎల్‌హెచ్‌బీ (లింకే–హాఫ్‌మన్– బుష్) కోచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఘనంగా టెండర్ రూట్స్ వార్షికోత్సవం

టెండర్‌రూట్స్ వార్షికోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యాజమాన్యం

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 10 : ఖమ్మం నగరంలోని హార్వెస్ట్ టెండర్ రూట్స్ 15వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. అడ్వకేట్ ఏఐఎల్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు బోధించే పద్ధతిలో వర్క్ టు లెర్న్ పద్ధతిలో పాఠం నేర్పిస్తే జీవితకాలం గుర్తుంటుందన్నారు. ఈ దిశగానే పాఠశాల కృషి చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి, అసీమా, ఉషశ్రీ పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాలను ముందుగానే చేరుకున్న కిష్టారం ఓసీ

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి10: కిష్టారం ఓసీ 2024–25 ఆర్థిక ఉత్పత్తి లక్ష్యం 24 లక్షల టన్నులు ఈ నెల 8 నాటికి (51రోజుల ముందుగానే) చేరుకుందని కిష్టారం ఓసీ పీవో నర్సింహారావు అన్నారు. సోమవారం కిష్టారం ఓసీ సైట్ ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉత్పత్తి లక్ష్యాలను ముందుగానే చేరుకోవడంలో దోహదపడిన ఉద్యోగులకు, డీఎల్‌ఆర్ కార్మికులకు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్స్‌కు, యూనియన్ నాయకులకు, అధికారులకు అభినందించారు. రానున్న రోజుల్లో కూడా ఉద్యోగులందరూ సమిష్టిగా రక్షణతో, నాణ్యతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ రామకృష్ణ, ఇన్‌చార్జి పీవో ప్రసాద్, అడిషనల్ మేనేజర్ బాబు, ఏఐటీయూసీ యూనియన్ నాయకులు కిశోర్, ఐఎన్‌టీయూసీ నాయకులు బాలాజీ, సంక్షేమాధికారి విజయసందీప్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ సర్వీస్‌ల మంజూరుకు నిబంధనలు సులభతరం

టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సురేందర్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 10 : జిల్లాలో కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు మరింత సులభతరం చేశామని టీజీఎన్‌పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ ఎస్‌ఈ ఏ.సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తును తిరస్కరించకుండా వినియోగదారుడు సరైన విధంగా స్పందించడానికి మరో అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్ఎంఎస్ ద్వారా తెలుసుకుని నిర్దిష్ట సమయంలో అవసరమైన పత్రాలు సమర్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తులను ట్రాకింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. టీజీఎన్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌తో తమ అప్లికేషన్ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేయాలని సూచించారు.

యాసంగికి సరిపడా యూరియా నిల్వలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 10 : ప్రస్తుత యాసంగి పంటల సాగుకు అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డీ పుల్లయ్య తెలిపారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో వ్యవసాయశాఖ ఏడీఏలు, మార్క్‌ఫెడ్ అధికారులతో యూరియా నిల్వలపై సమీక్షా చేశారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ ఈ యాసంగి సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 65వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని, నేటివరకు 58,056 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి సొసైటీలో యూరియా అమ్మకాలను గమనిస్తూ అందుకు అనుగుణంగా ముందస్తుగానే సొసైటీలకు తరలించడం జరుగుతుందన్నారు. యూరియా విక్రయాల్లో పారదర్శకత కోసం పీవోఎస్ యంత్రాల ద్వారా క్రయవిక్రయాలు జరగాలన్నారు. పందిళ్లపల్లి గ్రామంలో రేక్‌పాయింట్ ప్రారంభంకాకపోవడం పట్ల ఖమ్మంలోని మిర్యాలగూడ, వరంగల్ రేక్‌పాయింట్ల నుంచి జిల్లాకు యూరియా సరఫరా జరుగుతుందన్నారు. ఫిబ్రవరి నెల ప్లాన్ ప్రకారం 1500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా నేటివరకు 6900 మెట్రిక్ టన్నులు సరఫరా చేయడం జరిగిందని డీఏవో పేర్కొన్నారు. సమావేశంలో ఏడీఏ పీ వాసవీరాణి, ఏవో టెక్నికల్ నవీన్, మార్క్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఏవో పుల్లయ్య

ఎయిడ్స్‌పై అవగాహన

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీఈవో, ఏఎంవో

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 10 : ఖమ్మం నగరంలోని మహిళా ప్రాంగణంలో సోమవారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన, పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగ అధికారి సత్యకుమార్ హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ రాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఈవో సోమశేఖరశర్మ, ఏఎంవో కేశవపట్నం రవికుమార్, ఆర్‌పీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్...

ఖమ్మం నగరంలోని అర్బన్ ఎంఈవో కార్యాలయంలో సోమవారం ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సైన్స్‌లో జిల్లా ఖ్యాతిని పెంచిన ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, సుజాత, హనుమ, రజాలిపాషాను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో శైలజలక్ష్మి, డీసీఈబీ సెక్రటరీ నారాయణ, డీఎస్‌వో జగదీశ్వర్, శ్రీనివాస్, ఆదిత్యకుమార్, ఊటుకూరి శ్రీనివాస్, రవికుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయచైతన్య సదస్సు

అవగాహన కల్పిస్తున్న జడ్జి కార్తీక్‌రెడ్డి

బోనకల్లు, ఫిబ్రవరి 10: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆ కళాశాలలో సోమవారం న్యాయ చైతన్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మధిర జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని, కష్టపడుతూ కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. అనంతరం వంటగది, డైనింగ్‌హాల్ పరిశీలించారు. హ్యూమన్ రైట్స్ సంస్థ సభ్యులు కోట వెంకట్, కన్నెపోగు వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పద్మావతి, కోర్టు సిబ్బంది వెంకన్న, మల్లేశం, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

కూసుమంచి, ఫిబ్రవరి 10: ఈ నెల 26 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని తహసీల్దార్ కరుణశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక శివాలయ ప్రాంగణంలో సోమవారం జరిగిన మహాశివరాత్రి ఉత్సవాల సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరుగనున్నందున ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. మాజీ డీసీపీ, నిర్మాణకర్త సాదు వీరప్రతాపరెడ్డి, ఎస్సై నాగరాజు, ఈవో శ్రీకాంత్, దేవస్థానం చైర్మన్ ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **వైరా బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **మొగిలి కసల్య @ మొగిలి కౌసల్య**, W/o : తిరుపతయ్య, వయస్సు : 48 సం||లు, నివాసం : ఇ.నెం. 4–5, రాజులపాలెం గ్రామం, ఏన్కూరు మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : 1వ పార్టీ వారు : మొగిలి కసల్య @ మొగిలి కౌసల్య గారి వాటా విలువ రూ.12,25,000/–లు, ఖమ్మం రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, వైరా సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలో ఖమ్మం జిల్లా పరిషత్, ఏన్కూరు మండల పరిషత్,హిమామ్‌నగర్ (E) గ్రామపంచాయితీ పరిధిలో చేరిన నాచారం గ్రామ రెవిన్యూ రికార్డుకు చెందిన రాజులపాలెం గ్రామములో గల గృహసహిత నివేశన స్థలము విస్తీర్ణం. చ||గ|| 527.77లు ఇందుకు సరియగు చ||మీటర్లు 441.26 అందులో గల ఇ.నెం. 4–22, అసెస్మెంట్ నెం. 207గా గల గృహము యొక్క ఆర్.సి.సి. నిర్మాణ వైశాల్యము చ||అ|| 400.0లు మరియు ఏ.సి.సి. నిర్మాణ వైశాల్యము చ||అ|| 250.0లు అట్టి గృహమునకు గల విద్యుత్ సర్వీసు మీటరు విద్యుత్ వగైరా ఫిట్టింగులతో గల గృహము యొక్క వార్షిక అద్దె విలువ రూ. 8,000/–లు, గృహము యొక్క వయస్సు 10 సం||లు, **డాక్యుమెంట్ నెం. 1136/2024** గల అట్టి గృహ సహిత నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు**: గ్రామ పంచాయితీ రోడ్డు, **పడమర** : ధారావత్ వీరు గారి ఖాళీ స్థలము, **ఉత్తరం** : మొగిలి నరసింహారావు గారి గృహము, **దక్షిణం** : మొగిలి రాములు గారి భూమి.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

దివ్యాంగుల సంరక్షణ అందరి బాధ్యత

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 10 : న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సదన్‌లో పారా లీగల్ వలంటీర్లలకు సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ చంద్రశేఖర్ మాట్లాడుతూ మానసిక, దివ్యాంగుల సంరక్షణ అందరి బాధ్యతని, వారికి ఆరోగ్య సంరక్షణ, చికిత్స, పునరావాసం కల్పించడం మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీపాల్‌రెడ్డి నామినేషన్‌కి జిల్లా పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 10 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి సోమవారం ఖమ్మం నుంచి పీఆర్టీయూ నాయకులు నల్గొండ తరలివెళ్లారు. 60 కార్లలో 300 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, రంగారావు, మోత్కూరి మధు, కట్టా శేఖర్‌రావు పాల్గొన్నారు.

స్పౌజ్ ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇవ్వాలి

జిల్లాకు వచ్చిన స్పౌజ్ ఉపాధ్యాయులకు వెంటనే పోస్టింగ్ ఉత్తర్వులివ్వాలని టీపీటీఎఫ్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, వెంగళరావు డిమాండ్ చేశారు. సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు ప్రసంగించారు. 36 మంది స్పౌజ్‌లో జిల్లాకు వచ్చిన 20రోజులు పూర్తైన నియామకపు ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్, కేవీ, శ్యాంసుందర్, సంధ్యారాణి పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

వైరాటౌన్, ఫిబ్రవరి10: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డుకు చెందిన కాటేపల్లి రామకృష్ణ భార్య కాటేపల్లి సరస్వతి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె నేత్రాలను ఖమ్మం నేత్రనిధికి దానం చేసేందుకు కుమారులు కాటేపల్లి విజయ్, కాటేపల్లి కిరణ్, కాటేపల్లి నవీన్ ముందుకు వచ్చారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఖమ్మం నేత్రనిధి వారు నేత్రాలను సేకరించారు.

కోడిపందెం స్థావరంపై దాడి

మధిర, ఫిబ్రవరి 10: చింతకాని మండలం కోమట్లగూడెంలో కోడిపందేలు ఆడుతున్న స్థావరంపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9 వేల నగదును, కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

స్వాతంత్య్ర సమరయోధురాలు సుగుణమ్మ మృతి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 10: మండలంలోని కొక్కిరేణి మాజీ సర్పంచ్, స్వాతంత్య్ర సమరయోధురాలు చావా సుగుణమ్మ (85) సోమవారం మరణించింది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. సోమవారం తుదిశ్వాస విడిచారు. కాగా, ఆమె భౌతికకాయాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఇతర ప్రజాప్రతినిధులు రాయల నాగేశ్వరరావు, చావా శివరామకృష్ణ, చావా వేణు, పలు పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోలు

మధిర, ఫిబ్రవరి 10: చింతకాని ఎంపీడీవోగా చుంచు శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా విధులు నిర్వహించిన వై.రామయ్య ఇటీవల పదవీవిరమణ పొందారు. ప్రస్తుతం డీఏఆర్ఏలో అడిషనల్ పీడీగా విధులు నిర్వహిస్తున్న చుంచు శ్రీనివాసరావును చింతకాని ఎంపీడీవోగా నియమిస్తూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

వేంసూరు, ఫిబ్రవరి 10: వేంసూరు ఎంపీడీవోగా పరిమి రాజారాం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం రూరల్ ఎంపీవోగా పనిచేస్తున్న రాజారాం ఉద్యోగోన్నతిపై వేంసూరు వచ్చారు. వేంసూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న ఎంపీవో రంజిత్‌కుమార్ రాజారాంకు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోను యూడీసీ కల్పన, టైపిస్ట్ మంగమ్మ, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాబ్జిప్రసాద్

వేంసూరు, ఫిబ్రవరి 10: వేంసూరు తహసీల్దార్‌గా కల్లూరు తహసీల్దార్ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న బాబ్జిప్రసాద్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. బాబ్జిప్రసాద్ మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చిన ప్రతిఒక్కరి సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు వెంటనే జారీ చేయడం జరుగుతుందన్నారు.

గింజుపల్లి నిఖిల్‌కు నివాళి

మధిర, ఫిబ్రవరి 10: మధిర మండల సమీపంలోని ఏపీ రాష్ట్రంలో గల ఎన్టీఆర్ జిల్లా దొడ్డదేవరపాడు గ్రామానికి చెందిన గింజుపల్లి భాస్కర్‌రావు పెద్దకుమారుడు గింజుపల్లి నిఖిల్ ఇటీవల మృతిచెందారు. కాగా, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు.. సోమవారం ఆ గ్రామానికి వెళ్లి నిఖిల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మధిర నాయకులు రావూరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బోనకల్లు రచయితకు జాతీయ పురస్కారం

బోనకల్లు, ఫిబ్రవరి 10: మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన యువ రచయిత కొమ్ము రవికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. ఆయన రాసిన 'స్వార్థపు బుద్ధి' అనే కవిత జాతీయస్థాయి పురస్కారాన్ని గెలుచుకుంది. 'బుద్ధి' అనే అంశంపై 'అక్షరాలతోవ' అనే సాహితీ సంస్థ ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి కవితల పోటీల్లో కొమ్ము రవి రాసిన కవిత గెలుపొందింది. ఈ మేరకు ఖమ్మంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కవి కొమ్ము రవికి సంస్థ బాధ్యులు పురస్కారాన్ని ప్రదానం చేశారు. అక్షరాల తోవ నిర్వాహకులు నామా పురస్కారం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్ పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మృతి

బోనకల్లు, ఫిబ్రవరి 10: మండలంలోని గోవిందాపురం–ఎల్ గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ప్రముఖ న్యాయవాది వేడునూతల శ్రీనివాసరావు మాతృమూర్తి సీతమ్మ(100) సోమవారం రాత్రి మృతిచెందారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు గోవిందాపురం–ఎల్ గ్రామానికి చేరుకొని సీతమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో వైరా విద్యార్థుల ప్రతిభ

వైరాటౌన్, ఫిబ్రవరి10: వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆదివారం జరిగిన జాతీయ, అంతర్జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో వైరా విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. కరాటేలో శిక్షణ ఇచ్చిన మాస్టర్ రఘును ఉన్నతాధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

నోట్‌బుక్స్ అందజేత

వైరాటౌన్, ఫిబ్రవరి10: వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు, సౌభాగ్యలక్ష్మి మనువడు ప్రణవ్ సాయి, ముప్వా మాధవి కృష్ణారావు దంపతుల కుమారుడు పుట్టినరోజు సందర్భంగా మండలంలోని సోమవరం గ్రామంలో మండల ప్రజాపరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం

పెనుబల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని ముత్తగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండర్ కోట జాన్ ఆధ్వర్యంలో 9, 10 తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై మోటివేషన్ స్పీకర్స్ కోట కిషోర్‌బాబు, పంజి జైపాల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పదోతరగతి తర్వాత వివిధ కోర్సులు, విద్యావకాశాలు, మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవలంబించాల్సిన పద్ధతులు, తదితర అంశాలపై వివరించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం మోహన్‌రావు, ఫౌండర్ కోట జాన్, సభ్యులు కేకే.రావు, రవికుమార్, ప్రశాంత్‌కుమార్, మల్లిక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 10: మండలంలోని కుక్కునూరు గ్రామానికి చెందిన శెట్టిపల్లి హాసిని చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి తాతయ్య, నాయనమ్మ వద్ద ఉండి 7వ తరగతి చదువుతుంది. ఆర్థిక స్థోమత లేకపోవడంతో చదువుకు ఆటంకం కలుగుతుంది. విషయం తెలుసుకున్న సత్తుపల్లి పద్మానాయక వెలమ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి రామారావు విద్యార్థిని చదువు కోసం సత్తుపల్లి పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం సలహాదారులు కోటగిరి ఆనంద గజపతిరావు చేతుల మీదుగా చిన్నారికి సోమవారం రూ.10 వేలు అందజేశారు. అదేవిధంగా హాసిని చదువు నిమిత్తం ప్రతి సంవత్సరం రూ.10 వేలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో దామెర రమేష్, దామెర ప్రసాద్, రాఘవయ్య, బోయినపల్లి రామారావు, కోటగిరి ఆనందగజపతిరావు, కానిస్టేబుల్ సీతారామారావు పాల్గొన్నారు.